మీ ఇంటిపై మీకే పూర్తి హక్కులు


లబ్ధిదారుకు వాహనం అందజేస్తున్న మంత్రి జోగి రమేష్


లబ్ధిదారుకు ఓటీఎస్ పట్టా అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

- మాటలు కాదు.. చేతల్లో అభివృద్ధి చూపిన జగనన్న
- మంత్రి జోగి రమేష్
- బంటుమిల్లిలో 205 మందికి ఓటీఎస్ పట్టాల పంపిణీ

బంటుమిల్లి: ఇళ్ల లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం వరమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఓటీఎస్ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన ఇంటిపై సర్వ హక్కులు వారికే ఉంటాయని చెప్పారు. బంటుమిల్లి సచివాలయం-1 వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జోగి రమేష్ పాల్గొని 205 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ, మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిల హయాంలో ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లను నిర్మించిందన్నారు. అలా ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ఆ ఇళ్లపై హక్కు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వన్‌టైం సెటిల్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చారని చెప్పారు. దీంతో లబ్ధిదారులకు ఆ ఇంటిపై శాశ్వత హక్కు ఏర్పడుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు పేదల ఇళ్లకు కేవలం నివశించే హక్కులు మాత్రమే ఉండేవని, ఇప్పుడు సీఎం జగనన్న ఆ ఇళ్లకు సర్వహక్కులు కల్పించి లబ్ధిదారులు బ్యాంకు రుణం పొందేలా రూపకల్పన చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం బంటుమిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మత్స్యశాఖ ఆధ్వర్యంలో పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా ముగ్గురు లబ్ధిదారులకు టీవీఎస్ ఎక్సెల్ హెచ్‌టీ మోటార్ సైకిల్, ఐస్‌బాక్స్‌తో కూడిన వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చినబాబు, జెడ్పీటీసీ వెంకటరమణ, బంటుమిల్లి సర్పంచ్ కృష్ణవేణి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజబాబు, ఎంపీడీఓ స్వర్ణభారతి, తహసీల్దార్ సత్యనారాయణ, ఫిషరీస్ ఏడీ వెంకటేశ్వరరెడ్డి, ఎఫ్‌డీఓ అంజనీ పాల్గొన్నారు.

మార్మోగిన అంబేడ్కర్ నామస్మరణ

విగ్రహావిష్కరణకు తరలివచ్చిన భారీ జనసందోహం


కలపటం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి జోగి రమేష్

గూడూరు: గూడూరు మండలం గండ్రం, ముక్కొల్లు, కలపటం గ్రామాల్లో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా సాగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకుమర్రు గ్రామం నుంచి భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మంత్రి తనయుడు జోగి రాజీవ్‌లకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలతో దళిత సంఘాలు, అంబేడ్కర్ యూత్, జై భీం సంఘాల ఆధ్వర్యంలో ఆకుమర్రు, గూడూరు సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ టాప్ జీపుపై మంత్రి జోగి రమేష్, పార్టీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. ర్యాలీ అద్యంతం జై జగన్, జై జోగి, జై భీమ్ నినాదాలతో మార్మోగింది.

టీడీపీ కవ్వింపు చర్యలు

అదే సమయంలో మచిలీపట్నం పర్యటనకు వెళ్లనున్న చంద్రబాబు రాక కోసం గూడూరు సెంటర్‌లో టీడీపీ శ్రేణులు వేచి చూస్తున్నారు. మంత్రి జోగి రమేష్ ర్యాలీలో వేలాదిమంది ఉండటం చూసి ఈర్ష్యతో టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ శ్రేణులు ఎంతగా రెచ్చగొట్టినా మంత్రి జోగి రమేష్ సంయమనంతో పార్టీ శ్రేణులు శాంతియుతంగా ర్యాలీ కొనసాగేలా నాయకులను పురమాయించారు. డీఎస్పీలు మాసూంబాషా, మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు చేపట్టారు.

దేశానికి దిశానిర్దేశం చేసిన అంబేడ్కర్

గండ్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మంత్రి జోగి రమేష్ మాట్లాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, లింగం సులోచనారాణి, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవనిగడ్డ ఎస్‌ఐ రమేష్ బాధ్యతల స్వీకారం



అవనిగడ్డ: అవనిగడ్డ ఎస్‌ఐగా జి. రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గన్నవరం-1 ఎస్‌ఐగా పనిచేస్తున్న రమేష్‌ని సాధారణ బదిలీల్లో భాగంగా అవనిగడ్డకు బదిలీ చేశారు. అవనిగడ్డలో గత కొన్ని నెలలుగా అవనిగడ్డ ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఎస్‌ఐగా రమేష్ బాధ్యతలు స్వీకరించడంతో ఆ లోటు తీరింది. ఈ సందర్భంగా పలువురు ఎస్‌ఐని కలిసి అభినందనలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెడన: శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన అబ్దుల్ ఖాలిక్ కుటుంబానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం కళాశాలకు విచ్చేసిన కుటుంబ సభ్యులకు కళాశాల తరఫున వసూలు చేసిన రూ.1,42,710 నగదును అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డి. బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీకే ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చినపాండ్రాక పీహెచ్‌సీ పరిశీలన



కృత్తివెన్ను: మండల పరిధిలోని చినపాండ్రాక పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి గీతాబాయి బుధవారం సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రక్త పరీక్షల నమోదు, మందుల వినియోగం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. వైద్యులు ఇమ్రాన్, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): రెండో నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో నియమింపబడిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు త్వరితగతిన ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ జి. గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-5, 6లకు సెలవులు సర్వీస్ రిజిస్టర్‌లో ఇంకా నమోదు చేయడం లేదని, సెలవులు నమోదు చేసేలా మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన సచివాలయ ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హత కలిగిన వారికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన 'లో కాస్ట్ స్టడీ ల్యాంప్'కు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. గత మార్చి నెల 28వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రదర్శన పోటీల్లో కూడా షార్ట్ లిస్ట్‌లో స్థానం సాధించింది. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ అమెజాన్ సంస్థ రూ. 2 వేలు నగదు బహుమతి అందించారు. పాల్గొన్న మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 1,000 విలువచేసే కిట్స్‌ను ఈ నెల 11న ఈఎండీపీ డిస్ట్రిక్టు మేనేజర్ జంపాన భాను కిరణ్ విద్యార్థులకు అందించి సత్కరించారు. విద్యార్థులు పి. నిఖిల్, కె. మహేష్‌కుమార్, కె. బాలవర్ధన్, ఎస్. లావణ్య, ఎం. హర్షితలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

చల్లపల్లి: మండల పరిషత్ నిధులతో స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీటీసీ సభ్యురాలు మహమ్మద్ షాహెదా బేగం నిధులు రూ.5 లక్షలతో ప్రధాన రహదారి నుంచి 122 మీటర్ల పొడవైన సీసీ రోడ్డు నిర్మించారు. పనులను ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీఓ అరుణ కుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ కమాల్, పంచాయతీ రాజ్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'


నాగాయలంకలో పథకాలు వివరిస్తున్న చిన్నారి


బందరు 23వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

కోడూరు: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ప్రతి ఇంటా ఉత్సాహంగా జరుగుతోంది. కోడూరు మండలంలోని ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం, కోడూరు గ్రామాల్లో బుధవారం 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు పర్యవేక్షణలో గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు స్థానిక పార్టీ నేతలను కలుపుకొని ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గృహస్తుల అనుమతితో స్టిక్కర్లను ఇంటి గోడలపై, సెల్‌ఫోన్లపై అతికించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, నాయకులు పరిశె మాధవరావు, కొండవీటి వీర వెంకట నారాయణరావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

● నాగాయలంక: ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట మీద నిలబడే మహోన్నత నేత సీఎం జగనన్న అని అవనిగడ్డ నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి) అన్నారు. నాగాయలంక సచివాలయం-1 పరిధిలో మూడు, నాలుగు వార్డులలో ఆయన పర్యవేక్షణలో బుధవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. 200 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల ఆశీస్సులు పొందారు. ఎదురుమొండి ఎంపీటీసీ మోకా నాగప్రసాద్, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, సచివాలయ కన్వీనర్ అందే సుధాకర్, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం బుధవారం నగరంలో ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు మరిచిపోలేమని ఆయా డివిజన్ల ప్రజలు నాయకులకు వివరించారు. మనసున్న ముఖ్యమంత్రి జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలు తెలిపారు. 23వ డివిజన్‌లో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పలు డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత థామస్ నోబుల్, లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ, గూడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **మోపిదేవి(మోపిదేవి):** మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. పెదప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ గౌరవం శ్రీనివాసరావు, రవికాంత్, మండల సోషల్ మీడియా కో-కన్వీనర్ కొక్కిలిగడ్డ పృథ్వీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్ చల్లగా ఉండాలి..

కృత్తివెన్ను: నాకు పెద్ద కొడుకువై ప్రతి నెలా నువ్వు ఇస్తున్న పింఛన్ సొమ్ము నన్ను ఎంతగానో ఆదుకుంటోంది.. నువ్వు నిండు నూరేళ్లూ చల్లగా ఉండాలి నాయనా అంటూ ఆ అవ్వ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించింది. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా వైఎస్సార్ శ్రేణులు బుధవారం నిర్వహించారు. కృత్తివెన్ను గుడిదిబ్బ గ్రామంలో జెడ్పీటీసీ మైల రత్నకుమారి నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఓ ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికించగా వృద్ధురాలు అప్యాయంగా జగనన్న స్టిక్కర్‌ను తడుముతూ మురిసిపోయింది. ఈ దృశ్యం ఆ తల్లి మనస్సులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ప్రేమను సాక్షాత్కరించింది.


గుడిదిబ్బ గ్రామంలో సీఎం స్టిక్కర్‌ను ఆప్యాయంగా తడుముతున్న వృద్ధురాలు

భర్తను, బిడ్డను కోల్పోయిన మహిళకు ఎమ్మెల్యే పరామర్శ


అజితున్నీసాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: కట్టుకున్న భర్త, కన్న బిడ్డ ఒక్కొక్కరుగా అనారోగ్యంతో ఏడాది లోపు మృతిచెందటంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న పేద ముస్లిం మహిళను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన ముస్లిం టైలర్ గుండేల్ అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది మృతిచెందాడు. వారి ఏకైక కుమారుడు రజా వలీ (మౌలాలీ) కూడా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. గుండేల్ భార్య అజితున్నీసాను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు పరామర్శించారు. గృహ నిర్మాణానికి సహకరించాలని అజితున్నీసా ఎమ్మెల్యేకు విన్నవించగా తమ వంతు సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు టీడీపీ నేతల స్వాగతం


చంద్రబాబు రోడ్ షో దృశ్యం

మచిలీపట్నంటౌన్: ఇదేం ఖర్మ రాష్ట్రానికి బహిరంగ సభలో పాల్గొనేందుకు బుధవారం రాత్రి 9 గంటల సమయంలో నగరంలోని మూడు స్తంభాల సెంటర్‌కు చంద్రబాబు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య తదితరులు గజమాల వేసి స్వాగతం పలికారు. రోడ్‌షోలో పాల్గొన్న వాహనంపై చంద్రబాబుతో పాటు కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి దేవినేని ఉమా, పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల రాజా, మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, బచ్చుల బోస్ తదితరులు ఉన్నారు. పెడన నియోజకవర్గానికి సంబంధించిన నాలుగు మండలాల కార్యకర్తలు గూడూరులో స్వాగతం పలికి మచిలీపట్నం చేరుకున్నారు. ఇక్కడ నుంచి కోనేరుసెంటర్, రామానాయుడుపేట సెంటరు మీదుగా హిందూ కళాశాలలోని బహిరంగ సభకు చంద్రబాబు చేరుకున్నారు.

బైక్‌ల సైలెన్సర్లు తీసి టీడీపీ కార్యకర్తల హడావుడి

- టీడీపీ క్యాడర్ అలజడితో ప్రజల్లో అసహనం
- జెండా కట్టిన బైక్‌తో వస్తే రూ.100, పెట్రోల్ ఉచితం


బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద ఉచిత పెట్రోల్ కోసం వేచి ఉన్న టీడీపీ కార్యకర్తలు

మచిలీపట్నం టౌన్: చంద్రబాబు రోడ్ షో తో నగరంలోని తెలుగు తమ్ముళ్లు ప్రజలను అసహనానికి గురిచేశారు. చంద్రబాబు మూడు స్తంభాల సెంటర్‌కు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటారని ప్రచారం చేసినా ఆయన రాక ఆలస్యం కావడంతో టీడీపీ జెండాలతో కూడిన ద్విచక్ర వాహనాలను నడిపే యువకులు సైలెన్సర్లను తొలగించి అధిక శబ్దం చేస్తూ నగరంలో హడావుడి సృష్టించారు. మద్యం దుకాణాల వద్ద జెండా కట్టిన వాహనాలను నిలిపి మరీ మద్యం తాగారు. జెండా కట్టిన వాహనంతో వచ్చే వాహనాలకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర రూ. 100తోపాటు పెట్రోల్ ఉచితంగా కొట్టించారు. దీంతో నగరంలోని పలు పెట్రోల్ బంకులు టీడీపీ జెండాలతో కూడిన బైక్‌లతో రద్దీగా మారాయి. రోడ్డుషో లో 10 వేల బైక్‌లతో పాల్గొన్నట్టు టీడీపీ నాయకులు ప్రకటించినా ఆశించిన మేర స్పందన కనపడలేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులకు మద్యం, బిర్యానీ, నగదు ఆశ చూపి సమావేశానికి రావాలని కోరినట్లు ప్రచారం సాగుతోంది. అలాగే పలు డివిజన్లలో ఇంటింటికి తిరిగి బొట్టు పెట్టి మరీ చంద్రబాబు సభకు రావాలని మహిళలను బతిమలాడుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

ఉల్లిపాలెం మహాకుంభాభిషేక ఉత్సవాలపై శోభాయాత్ర

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి వారి ఆలయంలో జరుగనున్న మహా కుంభాభిషేక మహోత్సవాల ప్రచారంలో భాగంగా బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ ఆలయ ప్రాంగణం వద్ద శోభాయాత్రను ప్రారంభించారు. శ్రీమన్నారాయణుడి ఆలయం నిర్మించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30 నుంచి మే నెల 12వ తేదీ వరకు 12 రోజుల పాటు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామని అష్టాక్షరీ స్వామీజీ చెప్పారు. మే 12న కుంభాభిషేకం జరిపి, అదే రోజు లక్ష మందికి మహా అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఆకట్టుకుంది.

నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.3.44 లక్షలు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయానికి హుండీ ద్వారా రూ.3.44 లక్షల ఆదాయం లభించింది. అమ్మవారి ప్రధాన జాతర నిర్వహించి నెల రోజుల పూర్తి కావడంతో ఈ నెల 5న అమ్మవారి నెల సంబరాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవదాయ శాఖాధికారులు బుధవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. నెల రోజులకు గాను అమ్మవారి హుండీ ద్వారా రూ.3,44,930 ఆదాయం లభించిందని ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. మార్చి 5,6,7 తేదీల్లో జరిగిన అమ్మవారి ప్రధాన జాతర సందర్భంగా ఆలయానికి రూ.16.52 లక్షల ఆదాయం లభించిందని, నెల సంబరంతో కలుపుకొని నెల రోజుల్లో మొత్తం రూ.19.96 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరిందని ఈఓ వివరించారు.

పనులు ప్రారంభించే ముందు దీక్షలెందుకు?

- కోడూరు రోడ్డు త్వరలో ప్రారంభిస్తాం
- రైతు విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం


చల్లపల్లిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణానికి టెండర్లు ఖరారై, నిర్మాణ పనులు ప్రారంభించే ముందు జనసేన నాయకులు రిలే దీక్షలు చేపట్టడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ కడవకొల్లు నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు కాలనీలో 1,271 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకున్నారు. నరసింహారావు మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, విమర్శలు చేసినా ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో ఎన్ని రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు జరిగినా ప్రభుత్వ సహాయం అందించని నాయకులు నేడు ఉద్యమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చింతలమడ రోడ్డు ప్రమాద బాధితులకు త్వరలో ప్రభుత్వ సాయం అందించనుందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో కొత్తమాజేరులో నీటి కాలుష్యంతో 18 మంది చనిపోతే, నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి వారి పక్షాన బందరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసినా చంద్రబాబు కనీసం స్పందించలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఘంటసాల జెడ్పీటీసీ తుమ్మల మురళి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం, నడకుదురు సర్పంచ్‌లు కొల్లూరి కోటేశ్వరరావు, గొరిపర్తి సురేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్లు శీరం వెంకట సత్యనారాయణ (నాని), పాగోలు నాగ సీతారామారావు (ఫణి), నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ గరుడప్రసాద్‌కు మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


గరుడప్రసాద్‌ను పరామర్శిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక బుధవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీపీ తనయుడు వంశీకృష్ణ మృతి చెందిన విషయం విదితమే. కొమాళ్లపూడిలోని ఎంపీపీ నివాసానికి వారు చేరుకుని గరుడప్రసాద్‌ను, ఆయన భార్య సీతనపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కూనసాని మహాలక్ష్మీలను పరామర్శించారు. మంత్రి సతీమణి, తనయుడు శకుంతలదేవి, జోగి రాజీవ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉప్పాల రాము, జెడ్పీటీసీ ఎం. రత్నకుమారి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, బంటుమిల్లి ఎంపీపీ చినబాబు పాల్గొన్నారు.

22న నేత్ర వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక కృష్ణానది తీరంలోని ఫుడ్ కోర్టు ఆవరణలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు సెల్ 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

జేవీకే కిట్ల స్టాక్‌ను పరిశీలించిన డైరెక్టర్


ఎంఈఓ మెటల్దారాణితో మాట్లాడుతున్న డైరెక్టర్ మస్తానయ్య

పెడన: విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి ఇవ్వనున్న జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్‌ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ట్రెయినింగ్ రాష్ట్ర డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య బుధవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మార్సీ భవనం (బంగ్లా స్కూల్)ను సందర్శించిన ఆయన కిట్లకు సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. నాలుగో విడత పంపిణీకి సంబంధించి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మెటల్దారాణి పూర్తి సమాచారం అందజేశారు. సీఆర్పీలు, ఐఈఆర్‌టీలతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. మండల స్థాయిలోని క్వాలిటీ కంట్రోల్ టీంలో మండల ఇంజినీరు, ఏపీఎంలు సభ్యులుగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంఓ జి. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ

పెడన: ఇంటి, ఖాళీ స్థలం పన్ను బకాయి ఉన్న వారు ఏకమొత్తంగా చెల్లిస్తే వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉందని, పండుగ, ఆదివారం సెలవు దినాలలో కూడా ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించవచ్చని చెప్పారు.